సుఖంగావున్నారు నాకదే సంతోషం నాయనా. నా కూతురు ఇద్దరు పిల్లల్నికని చనిపోయింది. అల్లుడు మళ్లీ పెళ్లి చేసుకున్నాడు. సవతితల్లి పిల్లల్ని సరిగ్గా చూడడం లేదని నేనే తెచ్చి పెంచుతున్నాను" అన్నదా విడ.

తానెంతో దీనస్థితిలో వున్నప్పటికీ, తాను పెంచి పోషించినవారెవరూ ఆమె వైపు తిరిగిచూడకపోయినా ఆమెకు ఎవరిమీదా కోపం లేదు. వారినుండి ఆమె ఏమీ ఆశించడం లేదు. కూతురు పిల్లల్ని తెచ్చి పెంచుతూంది. తన ధర్మం తాను నెరవేరుస్తున్నట్లుగా తృప్తి పడుతూంది.

"ఇదిగో వీళ్లే నా మనమలు" అని ఇద్దరు పిల్లల్ని పరిచయం చేసింది. "పిల్లలు బుద్ధిమంతులు తెలివైన వాళ్లు. బాగా చదువుకుని పైకొస్తారు నీలాగే" అంది నవ్వుతూ.

వీళ్లు పెద్దవాళ్లయి పైకొస్తేమాత్రం ఆవిడ కష్టాలు తీరుతాయా? ఆవిడ పిల్లలు పైకొచ్చారు. ఆవిడ తన కొడుకులా చూసుకున్న భద్రం చదువుకుని పైకొచ్చాడు. ఆమె కష్టాలు తీరేయా?

"మీరు ఎంతో మందికి సాయం చేశారు. వాళ్లంతా పైకొచ్చారు. కాని మీ కష్టాలు మాత్రం తీరవు."

"అదేమిటి నాయనా. మన కష్టాలెవరో తీరుస్తారనే ఆశతో యితరులమీద అభిమానం చూపిస్తామా? మన మమకారాలకు ప్రతిఫలం ఆశిస్తామా" అన్నదావిడ.


ఆమె మాటలు వింటే నాకాశ్చర్యం వేసింది. ఆమె మనసు సముద్రంలా విశాలమైనది, లోతైనదీను. ప్రతిఫలాపేక్ష లేని ఆ గంభీరప్రకృతి మానవత్వపు అంచులు తాకి విస్తరించినట్లనిపించింది. జీవనపోరాటంలో మనం మనచుట్టూ కట్టుకునే స్వార్థపు రాతిగోడలకు అది తూట్లు పొడుస్తున్నది.

"మీరు మీ కోసం కాకుండా అందరికోసం బతుకుతున్నట్లుంది."

"సరే నాయనా, మనకు చేతనయినదీ మనకు తృప్తి కలిగించేదీ మనం చేస్తాం. ఇతరులపట్ల ప్రేమాభిమానాలు లేకుండా ఎవరి మట్టుకు వారు బతికితే జంతువులకూ మనకూ భేదమేమిటి నాయనా" అన్నదావిడ.

సకల ధర్మాల సారాంశం ఒక్క వాక్యంలో చెప్పినట్టుగా తేలిగ్గా నవ్వుతూ చెప్పింది. అది అనుభవ పరిపాకంవల్ల ఏర్పడిన తాత్వికదృష్టి. ఆ మాటల బరువు, ఆ త్యాగబుద్ధి, ఆ హృదయనైర్మల్యం, ఆ కళ్ల వెలుగు నన్ను మాట్లాడనియ్యకుండా చేశాయి.

ధనమే ప్రధానమైన సాంఘిక వ్యవస్థలో మనిషి స్వార్థంతో తనచుట్టూ గోడలు కట్టుకుంటాడు. ప్రేమానురాగాలు కూడా ప్రతిఫలాపేక్షతోనే వుంటాయి. సమాజ సంక్షేమం వాడికవసరంలేదు. అలాంటి వ్యవస్థలో స్వార్థత్యాగంతో ఇతరులకోసం బతికే వరలక్ష్మమ్మ నాకు మరపురాని వ్యక్తి. ఆమె గురించి ఎన్నిసార్లు వ్రాసినా తృప్తి తీరదనిపిస్తుంది. □



# పరీక్ష

మా ఆవిడ పరీక్షకి వెళ్లింది. ఏదో మామూలు పరీక్ష అనుకున్నారా? అబ్బే కాదు. యం.ఏ. మొదటి సంవత్సరమా? కాదు. సెకండ్ ఇయర్. ఫస్ట్ ఇయర్ ఫస్ట్ ఛాన్స్‌లోనే పాసయింది. సెకండ్ ఇయర్ కూడా ఫస్ట్ ఛాన్స్‌లోనే పాసవాలని కాఫీ చేయడం దగ్గర నుంచి, అన్నం వండడం దాకా అన్ని బాధ్యతలు నా మీదే పెట్టింది. మా ఆవిడ అంటే నాకు ఎంతో యిష్టం!

మా ఆవిడ చేస్తున్నది టీచర్ ఉద్యోగం. ఒక ప్రక్క పిల్లలకి పాఠాలు చెప్తూ మరో ప్రక్క ప్రైవేట్‌గా యం.ఏ. కి వెళ్తోంది. అందుకే అరనిమిషమైనా వృథా చేయకుండా పుస్తకాలతో కుస్తీ మొదలు పెట్టింది.

నేను రాత్రి పదింటికే నిద్ర పోయేవాడిని, ఫ్లాస్క్‌లో టీ పోసి. ఒకరోజు అర్ధరాత్రి నన్ను లేపి "ఏవండీ 'ఫ్రెంచి రెవల్యూషన్' ఎప్పుడు జరిగింది?" అని నన్ను అడిగింది.

" మన పెళ్లి ఎప్పుడు జరిగిందో కూడా నాకు జ్ఞాపకంలేదు" అని విసుక్కున్నాను.

"ఏవండీ 'మాలిస్ (Malice) టు నన్ బట్ ఛారిటీ టు వన్ అండ్ ఆల్' అని ఎవరు ఎప్పుడు చెప్పారండీ" అని మరో రోజు రాత్రి అడిగింది.

"మీ నాన్నది చాలా విశాల హృదయం. నిన్ను నాకు కట్టబెట్టి ఆ మాట అని వుంటాడు" అని దుప్పటి కళ్లమీదకు లాక్కున్నాను.

"ఏమండీ... పరీక్షలు దగ్గరకు వస్తున్నాయి. ఒక్కొక్క పేపర్‌కి నాలుగు ప్రశ్నలు సెలక్ట్ చేసి పెట్టండి. మీది చాలా లక్కీ హాండ్" అని ఆఫీసుకి నా చేత వారం రోజులు సెలవు పెట్టించి నా ముందర పాత క్వశ్చన్ పేపర్ల కట్టలు పడేసింది.

"నేనూ బి.యస్.సి. కి యిలాగే ప్రశ్నలు సెలక్ట్ చేసుకుని, యివి తప్ప ఏమి యిచ్చి చస్తారని వెళ్లాను. నేను చదివిన నాలుగు ప్రశ్నలు తప్ప మిగిలిన సలభై ప్రశ్నలలో నాలుగు అడిగారు. అన్ని పేపర్లలోనూ అంతే. అరగంట హాల్‌లో కూర్చుని బయటకు వచ్చి ఆ తర్వాత స్టేట్ బ్యాంకికి వెళ్లాను" అని చెప్పాను.

"అది కాదండీ. సైన్స్ ఏ మాత్రం బుర్ర వున్నా పాస్ కావచ్చు. ఇది హిస్టరీ. మహాసముద్రం. అంతా చదవడం కష్టం. అందుకే కొన్ని ప్రశ్నలే చదవాలి. ఎన్ని రేట్లు గుర్తుండి చస్తాయి చెప్పండి" అంది మా ఆవిడ.

"సరే నీకోసం నువ్వు చెప్పినట్లు చేస్తాను. సెలక్ట్ చేసిన ప్రశ్నలు రాకపోతే నా మీద మండిపడకు" అని పేపర్‌కి నాలుగు ప్రశ్నల చొప్పున నాలుగు పేపర్లకి ప్రశ్నలు సెలక్ట్ చేశాను.

మా ఆవిడ పరీక్షలు ప్రారంభమయ్యాయి. అయితే జవాబులు రాయగల ప్రశ్నలే ప్రత్యక్షం కాలేదు. మా ఆవిడ సంగతేకాదు అందరి పరిస్థితీ అలా వుండడంతో నేను బ్రతికి బయటపడ్డాను.

"అసలు యిలా ప్రశ్నలు ఎందుకు యిస్తారండీ" అని మా ఆవిడ అడిగింది.

"నేను అదే చెబుదామనుకుంటున్నాను.విను" అంటూ మొదలు పెట్టాను."ఈ పేపర్లు సెట్ చేసిన ప్రముఖులని చిన్నప్పుడు తల్లి చచ్చిపోతే సవతి తల్లి రాచి రంపాన పెట్టివుంటుంది. ఎలాగో చదువుకుని యం.ఏ. ఫస్ట్‌క్లాస్‌లో పాసయి లెక్చరర్ ఉద్యోగం సంపాదించి వుంటారు. పెళ్లి అవుతుంది. ఆ భార్యాభర్తల మొదటి రోజుల ప్రేమకి చిహ్నంగా ఒక అమ్మాయి పుట్టుంది. అయితే రానురానూ ఆ పెళ్లాం గొంతెమ్మ కోరికలు కోరడంతో ఆ పురుషుడికి జీవితం మీద విసుగెత్తి పోతుంది. పెరిగి పెద్దయిన అమ్మాయి మరో కులం వాడిని ప్రేమించి చక్కగా వాడితో లేచిపోయి వుంటుంది. అలా వారికి ప్రపంచం మీద ద్వేషం, జీవితం మీద అయిష్టత, ఇతరుల మీద కసి పెరిగిపోతాయి. మరి ఎలా తీర్చుకుంటారు? పేపర్ సెట్ చేసే అవకాశం వచ్చినప్పుడు, అదే అదృష్టంగా భావించి మీ వంటివారిని బలి చేస్తారు. యూనివర్సిటీ వాళ్లు వారిని ఏమీ అనరు. వాళ్ళ రెవిన్యూ కూడా పెరుగుతుంది కదా" అని సుదీర్ఘంగా వివరించి చెప్పాను.

తను చదువుకున్నది చరిత్ర అయిన నేను చెప్పిన 'చారిత్రక విశేషం' మా ఆవిడకి అర్థం కావడమే కాక నచ్చినట్లూ నాకు విశదమయింది.

"ఇవాళ నుంచి మీరు స్టవ్ దగ్గరకి వెళ్ళక్కరలేదు" అంది. నేను తేలిగ్గా ఊపిరి పీల్చుకున్నాను.

—తాజీ ప్రసాద్